లాభాలార్జించే సర్కారు కాదు

- 30 రోజుల్లో డిజిటల్ హెల్త్‌కార్డులు
- క్యాన్సర్‌ను అత్యవసరంగా ఎదుర్కోవాలి
- ప్రజల సంక్షేమం కోరే ప్రభుత్వం
- సిఎం రేవంత్‌రెడ్డి

సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాబోయే 30 రోజుల్లో ప్రజలకు డిజిటల్ హెల్త్‌కార్డులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్ విద్యానగర్‌లో దుర్గాబాయి దేశ్‌ముఖ్ రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని ఆయన తెలిపారు. వీలైనంత మేరకు ప్రజలకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సిన అవసరముందని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరికి ఫ్యామిలీ డాక్టర్లు ఉండరనీ, ప్రతిసారి అనేక పరీక్షలు చేస్తే తప్ప వైద్యం అందించలేని పరిస్థితి వైద్యులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి సంబంధించిన డాటాతో ఒక్కొక్కరికి విడివిడిగా హెల్త్ ప్రొఫైల్ రూపొందించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల ప్రజల హెల్త్ ప్రొఫైల్స్‌ను డిజిటలైజ్ చేసి ఈ హెల్త్ కార్డుల్లో గతంలో వారు తీసుకున్న చికిత్స వివరాలను పొందుపర్చనున్నట్టు తెలిపారు. దీంతో అత్యవసర పరిస్థితితో పాటు ఎప్పుడు ఏ డాక్టర్ దగ్గరికి చికిత్స కోసం వెళ్లినా ఆ పేషంట్ గత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వేగంగా చికిత్స అందించడం సులభమవుతుందని సిఎం వివరించారు. ప్రభుత్వపరంగా తాము విధానాలను రూపొందించగలుగుతామని చెప్పారు. అయితే ఆ విధానాలు ప్రజలకు ఉపయోగపడే విధంగా స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. ఈ రూపకల్పనలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఇందు కోసం త్వరలోనే స్వచ్ఛంద సంస్థలతో సహకారం తీసుకుంటామని తెలిపారు. ఎన్‌జిఒలతో త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేసి వారి సూచనలు స్వీకరిస్తామనీ, వారిని భాగస్వాములను చేసుకుంటామని చెప్పారు. దీంతో తక్కువ రోజుల్లో ఎక్కువ సమాచారాన్ని సేకరించగలుగుతామన్నారు.

క్యాన్సర్ మహమ్మారిని అరికట్టేందుకు తక్షణం దృష్టి సారించాల్సిన అసరముందని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తనకు తెలిసిన ఒక పాత్రికేయుడు క్యాన్సర్ బాధను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. తమను సంప్రదించిన తర్వాత చికిత్స కోసం తగిన సాయం చేద్దామనుకునేలోపు మరణించడం కలచివేసిందని విచారం వ్యక్తం చేశారు. ఈ మహమ్మరిని పాలద్రోలేందుకు ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు కలిసికట్టుగా పోరాడుదామని ఆయన పిలుపునిచ్చారు.

తమ ప్రభుత్వం లాభాలార్జించే ప్రభుత్వం కాదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తున్నామని తేల్చిచెప్పారు. స్వాతంత్ర్య భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తీసుకున్న విప్లవాత్మక చర్యల ఫలితంగా సమాజంలో ఆకలి, కరువు చావులు లేవనీ, ప్రజల ఆయుష్షు పెరిగిందని తెలిపారు. ప్రస్తుత సమాజానికి అత్యంత అవసరమైన విద్య, వైద్యమే తమ ప్రాధాన్యతలని తేల్చి చెప్పారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ట్రస్టీ చైర్మన్ ఎస్‌విరావు వినతి మేరకు, ఇబ్రహీంపట్నంలో స్పోర్ట్స్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉస్మానియా యూనివర్సిటీలో స్థలం అప్పగింతకు సంబంధించిన విజ్ఞప్తిని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

అంతకు ముందు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ క్యాన్సర్ సేవలు ఒక సంక్లిష్టమైన విషయమని తెలిపారు. క్యాన్సర్ బాధితులు ఆస్పత్రులకు ఆలస్యంగా వస్తుండటం సమస్యగా ఉందని తెలిపారు. దీనిపై ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాలన్నారు. క్యాన్సర్ రోగులకు సేవలందించేందుకు స్పష్టమైన అవగాహనతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సెంటర్ ఏర్పాటుకు సహకరించిన దాతలను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎండి శ్రీధర్ పెద్దిరెడ్డి, దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ట్రస్టీ చైర్మన్ ఎస్‌వి రావు, మాజీ అధ్యక్షురాలు లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాధికారుల పోస్టులను మంజూరు చేయాలి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలు, అర్బన్ మండలాలు, అర్బన్ రెవెన్యూ డివిజన్లకు విద్యాధికారుల పోస్టులను మంజూరు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 21 జిల్లాలకు డిఇఒ, 28 డిప్యూటీ విద్యాధికారి (డిప్యూటిఇఒ), 59 మండల విద్యాధికారి (ఎంఇఒ), ఐదు అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులను మంజూరు చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్, ముఖ్యకార్యదర్శికి ఈ ఏడాది ఫిబ్రవరి 12న లేఖ రాశానని గుర్తు చేశారు. ఏడు నెలలు పూర్తవుతున్నా ఇంత వరకు ఆ పోస్టులను మంజూరు చేయలేదని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్బన్ మండలాలు, డివిజనర్లకు అవసరమైన ఎంఇఒ, డిప్యూటీ ఇఒ పోస్టులను అదనంగా లెక్కించి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్నందున ఆ పోస్టులను వెంటనే మంజూరు చేయాలంటూ బుధవారం లేఖ ఇచ్చానని పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా ఒపిఎస్ అమలు చేయాలి

- సోమనాథం కమిటీ నివేదికను బహిర్గతపర్చాలి
- ఎన్ఎంఒపిఎస్ సెక్రెటరీ జనరల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేయాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఒపిఎస్) సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం కేంద్ర క్యాబినెట్ ఇటీవల తీసుకున్న ఏకీకృత పెన్షన్ విధానం (యుపిఎస్) అమలును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా పెన్షన్ ఆక్రోష్ మార్చ్ పేరుతో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీల ద్వారా నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌పిఎస్, యుపిఎస్‌ను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని బీమా భవన్‌లో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఉద్యోగి తన ఉద్యోగ జీవితంలో నెలసరి జీతం నుంచి 10 శాతాన్ని, అదేవిధంగా ప్రభుత్వం వాటా 18.5 శాతం మొత్తం 28.5 శాతం ఎన్‌పీఎస్ ట్రస్ట్‌కు జమ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఉద్యోగి రిటైర్ అయినప్పుడు తన ప్రాన్ అకౌంట్‌లో జమ అయిన మొత్తాన్ని ఎన్‌పిఎస్ ట్రస్ట్‌కు సరెండర్ చేయాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత తనకు 48 శాతం నుంచి 50 శాతం బేసిక్‌తో కూడిన పెన్షన్ లభిస్తుందని అన్నారు. ఇది ఉద్యోగి తన సామాజిక భద్రతను కొనుక్కోవాల్సిన పరిస్థితి యూపీఎస్ వల్ల ఏర్పడుతుందని చెప్పారు. ఉద్యోగి కుటుంబానికి పెన్షన్‌తో సామజిక భద్రత ఇవ్వాల్సిన ప్రభుత్వం, పెన్షన్ కొనుక్కునే విధంగా తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుపీఎస్ విధానానికి మూలమైన సోమనాథన్ కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల ఆర్టీఐ ద్వారా కమిటీ నివేదికను అడిగితే బహిరంగపరచలేమంటూ ఆర్థిక శాఖ సమాధానం ఇచ్చిందన్నారు. ఇది ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో విస్మయం కలిగించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిపిఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సందీప్, రెడ్డప్ప, మదన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటిలో తెలంగాణను ముందుకు తీసుకెళ్తాం

- స్కిల్ నాలెడ్జ్ యూనివర్సిటీతో మరిన్ని అవకాశాలు
- మంత్రి శ్రీధర్‌బాబు

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐటీలో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. స్కిల్ నాలెడ్జ్ యూనివర్సిటీ ఏర్పాటుతో మరిన్ని ఉద్యోగ అవకాశాలు వస్తామని తెలిపారు. అనలిటికా అనకాన్ ఇండియా, ఇండియా ల్యాబ్ ఎక్స్పో, ఫార్మా ప్రో ప్యాక్ ఎక్స్పో-2024 కార్యక్రమాన్ని గురువారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ కేంద్రంలో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా ఉత్పత్తుల రంగంలో, పరిశోధన, రూపకల్పనలో భారత్ ప్రాధాన్యత గురించి వివరించారు. దాదాపు 500కుపైగా ఎగ్జిబిటర్లు, 7000కు పైగా ఉత్పత్తులు, 120కిపైగా కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణతో ఈ ఏడాది కార్యక్రమం శాస్త్రీయ, ప్రయోగశాల ఫార్మా రంగాల్లో భారతదేశ వృద్ధిని మరింత పెంపొందించడంలో కీలకంగా మారిందన్నారు. ప్రపంచ ఔషధ ఉత్పత్తిలో భారత్ ప్రస్తుతం 35 శాతం సహకారం ఉండగా.. రానున్న రోజుల్లో అది 50 శాతానికి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్ రంగాలకు మంచి వనరులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా జీనోవ్ వ్యాలీ నాలుగో దశ వంటి ప్రత్యేక జోన్ల వృద్ధి ద్వారా లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఈ రంగం ప్రపంచ విస్తరణలో తెలంగాణ బలమైన భాగస్వామిగా ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రపంచ లైఫ్ సైన్సెస్ వాల్యూ చైన్‌లో తెలంగాణ ఒక ముఖ్యమైన ప్రదేశంగా ఉండేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా మెస్సె మూంచెన్ ఇండియా సిఇఒ భూపిందర్‌సింగ్ మాట్లాడుతూ.. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఇది చాలా పెద్ద ట్రేడ్ ఫేర్ కార్యక్రమం అన్నారు. 70కి పైగా దేశాల నుంచి 25000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఇందులో అగ్రశ్రేణి నిర్ణయాలు తీసుకునే వారు, ఆవిష్కర్తలూ ఉన్నారని అన్నారు. ఫార్మాస్యూటికల్స్, బయోటెక్, ల్యాబ్ టెక్నాలజీల్లో భారత్‌ను గ్లోబల్ లీడర్‌గా నిలపాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ రంగాల్లో తెలంగాణ నాయకత్వం ఎంతో గొప్పదని, రానున్న కార్యక్రమాల కోసం తెలంగాణను పర్మినెంట్ హోస్ట్ రాష్ట్రంగా నిర్వహిస్తే బాగుంటుందని ఆకాంక్షించారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ 2వ అధనపు జిల్లా వారి కోర్టులో ఏలూరు

A.S.No. 21/2024

Between:

గుండపనేని వెంకటేశ్వరరావు వగైరాలు ..అప్పీలెంట్స్

మరియు

కొడాలి శివ నాగేశ్వరరావు వగైరాలు ..రెస్పాండెంట్స్

రెస్పాండెంట్స్: 2 మరియు 3

శ్రీమతి బోనాల మంగాయమ్మ, W/o. (లేటు) శేషగిరిరావు, D.No. 9-1-75/6/A, బద్రాచలం, బద్రాద్రికొత్తగూడెం జిల్లా, తెలంగాణారాష్ట్రం.

బోనాల గోపాలకృష్ణ, S/o. (లేటు) శేషగిరిరావు, D.No. 9-1-75/6/A, బద్రాచలం, బద్రాద్రికొత్తగూడెం జిల్లా, తెలంగాణారాష్ట్రం.

పై పేర్కొన్న 2,3 రెస్పాండెంట్స్, పై గ్రంధంలో శ్రీ కోర్టు వారి అప్పీలు నోటీసులు తీసుకొనక కాల యాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారి ఆదేశానుసారం ఈ ప్రకటన జారీ చేయడమైనది. పై పేర్కొన్న 2 మరియు 3 రెస్పాండెంట్స్ **ది.03-10-2024వ తేది ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై గ్రంధంలో తగురీతిలో సంజాయిషి యిచ్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు పై కోర్టు వారు తగు విచారణ గావించి తగురీతిలో ఆర్డర్స్ పాస్ చేయుదురని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

N.V. SATYANARAYANA
Advocate, Eluru
Cell: 94403 76655

Eluru
Dt. 26-09-2024.

సమావేశంలో పాల్గొన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి

బిఆర్ఎస్ పాలనలో విధ్వంసం

- రాష్ట్ర పునర్నిర్మాణంలో ఇంజనీర్లదే కీలక పాత్ర
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పాలనలో విధ్వంసమైన తెలంగాణను మళ్లీ పునర్నిర్మిస్తామని, రాష్ట్ర పునర్నిర్మాణంలో ఇంజనీర్లదే కీలక పాత్ర అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మాదాపూర్ డివిజన్ పరిధిలోని నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. టిజిపిఎస్‌సి నిర్వహించిన 1540 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల నోటిఫికేషన్‌లో ఉద్యోగాలు సాధించి.. ఆర్అండ్‌బీ శాఖకు కేటాయించిన 156 మంది ఏఈఈలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లంతా కష్టపడి పని చేయాలని సూచించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య, నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ వంటి ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకోవాలి.. కానీ, కాళేశ్వరం కట్టిన ఇంజనీర్లను కాదన్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు కట్టిన వెంటనే కూలిపోయి ఇంజనీర్ల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిన ఘటనలను చూశామని అన్నారు. విధి నిర్వహణలో ఇంజనీర్ల పాత్ర ఎంతో గొప్పదని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకూ తలొగ్గకుండా తమ కర్తవ్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పనిపట్ల ఎంతో సునిశితంగా, ఏకాగ్రతతో పనిచేయాలని చెప్పారు.

త్వరలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు

- ఐలమ్మ జయంతి వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి -కల్చరల్

తెలంగాణ పోరాటానికి, త్యాగానికి గుర్తుగా వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరబాద్ రవీంద్రభారతిలో గురువారం ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. త్యాగానికి గుర్తుగా ఐలమ్మ పేరును మహిళా విశ్వవిద్యాలయానికి రాష్ట్ర ప్రభుత్వం పెట్టిందని గుర్తు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఐలమ్మ త్యాగాన్ని గుర్తించని వారు, ఇప్పుడు నిరసనలు తెలుపుతున్నారని విమర్శించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ బిసిలను విస్మరించిందన్నారు. కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో బలహీన వర్గాల ఫెడరేషన్‌లో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది త్యాగాలు చేశారని, వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఐలమ్మకు నిజమైన నివాళి అంటే ఆమె పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగడమేనని అన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. ఐలమ్మ చరిత్రను పుస్తక రూపంలోకి తీసుకురావాలని అన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణ ఉద్యమాన్ని నిర్వహించామని గుర్తు చేసుకున్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిపోయిందని విమర్శించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ.. తొలి భూ పోరాటానికి, సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన ధైర్యశాలి ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కణిక ఐలమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ బీసీ కమిషన్ సభ్యులు తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, రాపోలు జయప్రకాష్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్ బి.బాలమాయ దేవి, మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి.సైదులు, తెలంగాణ అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె.అలోక్ కుమార్, తెలంగాణ వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మల్లయ్య బట్టు, తెలంగాణ రజక సహకార సంఘాల సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ కో చైర్మెన్లు మావురపు నరసింహ, చిట్యాల శ్వేతా ఐలమ్మ, కన్వీనర్లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE CHAIRMAN: MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-I ADDITIONAL CHIEF JUDGE: CITY CIVIL COURT AT: SECUNDERABAD

M V O P NO: 142 of 2023

Between:

Pinnitti Vasudeva Reddy ...Petitioner

AND

Buduma Naresh ...Respondents

To,

3. Madavath Raj Kumar S/o Lingam, Aged: 24 years, Occ: Driver of the crime vehicle, R/o. H.No. 1-15, Komatikuntla Thanda, Cheekatimamidi, Bommalaramaram, Yadadri Bhongir District, Telangana State. Please take notice that the above named Petitioner filed a MV OP for Compensation against you and the said case stands posted to 22-10-2024 for your appearance. Therefore you are hereby directed to appear before The HON'BLE I ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT, SECUNDERABAD on **dated:** 22-10-2024 **at 10.30 AM** either in person or through an Advocate failing which the matter will be decided Ex party.

(By the Order of the Court)

M/S . CH T V L NARASIMHA REDDY
M SUMALATHA
CH RAM MOHAN RAO
Advocates
10-1-5/5-001, Prathinav Residency,
Nehru Nagar, West Maredpally,
Seucnderabad-26
COUNSEL FOR THE PETITIONER

ప్రత్యామ్నాయం, పునరావాసం తర్వాతే ఇళ్లు కూల్చాలి

- మూసీ అభివృద్ధి పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేయొద్దు : తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎలాంటి ప్రత్యామ్నాయం, పునరావాసం కల్పించకుండానే హైదరాబాద్ మూసీ నది పరిసర ప్రాంతాల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న పేదల ఇళ్లు, గుడిసెలను హైడ్రా అధికారులు వెంటనే తొలగించేందుకు పూనుకోవడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ముందుగా పునరావాసం కల్పించిన తర్వాతే ఇళ్లను కూల్చే పనిని చేపట్టాలని కోరింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూసీ అభివృద్ధి పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎఫ్‌టిఎల్ జోన్‌లో దశాబ్దాలుగా ఉన్న రెండు వేలకుపైగా పేదల ఇండ్లు కూల్చడానికి హైడ్రా ప్రస్తుతం సర్వే చేసి మార్కింగ్ చేస్తున్నదని తెలిపారు. ఈ పేదలంతా కూలీ పని, చిన్నచిన్న షాపుల్లో ఇతర పనులు చేసుకుంటున్నారనీ, బలహీనవర్గాలకు చెందిన కుటుంబాలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందుల వల్ల గుడిసెలు వేసుకున్న వారు కొందరైతే, స్థలాలను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్లు చేసుకుని, ఇంటి నిర్మాణానికి మున్సిపల్ అనుమతి తీసుకుని ఇళ్లు కట్టుకున్న వారు కొందరున్నారని వివరించారు. అందువల్ల వారు నివాసం ఉంటున్న సమీప ప్రాంతాల్లో ఇళ్లను కేటాయించాల్సిన అవసరముందని సూచించారు. ప్రభుత్వం వారికి హైదరాబాద్ నగర శివార్లలో డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వడం వల్ల రోజువారీ పనిచేసుకుంటున్న పేదలు ఆ పనులకు వెళ్లడం ఆచరణలో సాధ్యం కాదని తెలిపారు. కావున ప్రత్యామ్నాయం కల్పించకుండా ఇళ్ల తొలగింపునకు పూనుకోరాదని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

శృతిమించుతున్న డిజె శబ్దాలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో సిపి ఆనంద్
- ప్రజల ప్రాణాల మీదకొస్తుందని ఆవేదన

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపి సివి ఆనంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి ఏడాదీ శృతిమించుతూ ప్రజల ప్రాణాలమీదకొస్తున్న డిజెల శబ్దాలను కట్టడి చేయాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ అన్నారు. మతపరమైన ర్యాలీల్లో డిజె, టపాసుల వినియోగంపై హైదరాబాద్ పోలీసులు బంజారాహిల్స్‌లోని సిసిసిలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ అధ్యక్షతన వహించి మాట్లాడారు. డిజె శబ్దాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఈ సౌండ్స్‌తో వృద్ధులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొందరు గుండె అదురుతుందని ఆందోళన చెందుతున్నారని, డిజె సౌండ్స్ శృతిమించుతున్నాయని చెప్పారు. కేవలం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగానే కాకుండా మిలాద్ ఉన్ నబి వేడుకల్లోనూ డిజె నృత్యాలు విపరీతమయ్యాయని చెప్పారు. ఈ సారి నగరంలో శబ్ద కాలుష్యం 500 శాతం పెరిగిందన్నారు. పండుగలు, ఉత్సవాలు లేదా ఏదైనా ర్యాలీల్లో డిజెలు ఎక్కువుగా వాడుతున్నారని తెలిపారు. పబ్‌లో డ్యాన్సులు చేసినట్టే ర్యాలీల్లో చేస్తున్నారని కమిషనర్ చెప్పారు. డిజె శబ్దాలను కట్టడి చేయాలని వివిధ సంఘాల నుంచి వినతులు వచ్చాయని తెలిపారు. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ మత సంఘాల ప్రతినిధులను పిలిచి వారి అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. అందరి అభిప్రాయాలను నివేదిక రూపంలో ప్రభుత్వానికి అందజేస్తామని, ఆ తర్వాత ప్రభుత్వం డిజెలపై ఓ నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. డిజె శబ్దాలపై నియంత్రణ లేకపోతే ఆరోగ్యాలు దెబ్బతింటాయన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్, ఎంఐఎం ఎమ్మెల్యేలు, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పోలీస్ అధికారులు, జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి, మత సంఘాల ప్రతినిధులు, జిహెచ్ఎంసి పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు డిజె సౌండ్స్‌పై పలు సూచనలు, సలహాలు అందించారు.

గోరిచెన్ శిఖరాన్ని అధిరోహించిన యశ్వంత్

- 20 ఏళ్ల వయసులో గిరిజన యువకుడు రికార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన యువ పర్వతారోహకుడు భుక్య యశ్వంత్‌నాయక్ 20 ఏళ్ల వయస్సులో రికార్డు సృష్టించాడు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రతిష్టాత్మకమైన ప్రమాదకరమైన శిఖరం, మౌంట్ గోరిచెన్‌ను విజయవంతంగా అధిరోహించాడు. రాష్ట్రంలోని గిరిజన ఏజెన్సీ ప్రాంతానికి చెందిన యశ్వంత్ నాయక్ తన ప్రయాణాన్ని అతి స్వల్ప వనరులతో ప్రారంభించాడు. అతనిలో ఉన్న అపారమైన పట్టుదల, కృషి, పర్వతారోహణ పట్ల ఉన్న ఆసక్తి ప్రపంచంలోని కఠినమైన శిఖరాలను అధిరోహించే స్థాయికి తీసుకొచ్చింది. 18 రోజుల పర్వతారోహణ యాత్ర సెప్టెంబర్ 4, 2024న ప్రారంభమైంది. సెప్టెంబర్ 19న మౌంట్ గోరిచెన్ శిఖరాన్ని అధిరోహించాడు. ప్రఖ్యాత ట్రాన్సెండ్ అడ్వెంచర్ కంపెనీకి చెందిన యశ్వంత్, ఈ అత్యంత క్లిష్టమైన శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన తొలి సివిలియన్ బృందంలో ఒకరిగా ఉన్నాడు. ఈ విజయం తనది మాత్రమే కాదని, తనను విశ్వసించిన, మద్దతిచ్చిన ప్రతి ఒక్కరిదని యశ్వంత్ నాయక్ అన్నారు. మౌంట్ గోరిచెన్‌ను అధిరోహించడం తన జీవితకాల స్వప్నం అన్నారు. నేడు దానిని సాధించినందుకు గర్వంగా ఉందని తెలిపారు.

డిసెంబర్‌లో హెచ్‌సిఎల్ సైక్లోథాన్

- విజేతలకు రూ.33.6 లక్షల బహుమతులు

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ టెక్ దిగ్గజం హెచ్‌సిఎల్ హైదరాబాద్‌లో సైకిలింగ్ ప్రియులతో సైక్లోథాన్‌ను నిర్వహించనున్నట్లు ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ఐటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ హాజరై జెర్సీని ఆవిష్కరించి ప్రభుత్వ మద్దతును తెలిపారు. హెచ్‌సిఎల్ బృంద బ్రాండ్ అధికారి రజత్ ఛందోలియా మాట్లాడుతూ.. 2024 డిసెంబర్ 15న తమ హైదరాబాద్ మొదటి ఎడిషన్ సైక్లోథాన్‌ను నిర్వహించనున్నామన్నారు. దీన్ని తెలంగాణా ప్రభుత్వ భాగస్వామ్యం, ఇండియన్ ఫెడరేషన్ సైక్లింగ్ యొక్క సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.33.6 లక్షల బహుమతులను అందించనున్నామన్నారు. నవంబర్ 30లోపు రిజిస్ట్రేషన్లు తెరిచి ఉంటాయన్నారు

IN THE COURT OF THE 2nd A.D.J AT BALLARI

I.C. No. 01/2023

BETWEEN:

Sri. Bandi Suresh Babu ...Petitioner

And

Laxmi Sai Trading and others ...Respondents

NOTICE

To.

Respondent No. R.3:

R.3. Generic Crop Sciences' Pvt.Ltd.2020-2021 R/o 5-28/3 Srivani Nagar Ameenpur, Patancheru Mandal Hydrebad-502032 T.S. GST.No:-36AAECG6027Aiz2 Tin-36399 248837C1N:-424233TS2012PTCO79418.

Whereas, the above named plaintiff has filed the above suit against you and others seeking partition and separate possession in respect of the suit property.

you are hereby directed to appear in this court person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be instructed and able to answer all such question of the day of 15th October 2024 11-00 Clock in the noon to answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to deny in support of your defence.

Take notice that in default of your appearance on the day before mentioned suit will be heard and determined in your absence. Given Under my hand and the seal of the court this 18th day of September 2024

(By Order of The Court)

Chief Administrative Officer

Prl.District and Sessions Court, Ballari

KALYAN KUMAR,
Advocate for the Petitionner.

బిఎస్ఇ టెక్ సూచీలో 25 శాతం రాబడి : మోతిలాల్ ఓస్వాల్ ఎంఎంసి

ప్రజాశక్తి - హైదరాబాద్ : మోతిలాల్ ఓస్వాల్ ఎఎంసి తన బిఎస్ఇ టెక్ ఇండెక్స్‌పై గడిచిన ఎనిమిది నెలల్లోనే 25.3 శాతం రాబడిని అందించినట్లు తెలిపింది. ఈ ఫండ్ 2023 ఆగస్టు నుంచి 42.12 శాతం రిటర్న్‌లు ఇచ్చిందని పేర్కొంది. ఇదే కాలంలో నిఫ్టీ ఐటి సూచీ 37.29 శాతం పెరిగింది. గత ఐదేళ్లుగా తమ ఈ ఫండ్ స్థిరమైన రాబడిని అందిస్తుందని పేర్కొంది.

గ్లోబల్ సిటీగా హైదరాబాద్

- విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు : మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహానగరం గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య, వ్యాపార సంస్థలు ఇక్కడికి తరలి రావడం, ప్రపంచం నలుమూలల నుంచి పెట్టుబడులు వెల్లువెత్తడమే ఇందుకు నిదర్శనమన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ముఫకంజా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీలో నూతన విద్యార్థుల ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాలేజీ ప్రిన్సిపల్ మహిపాల్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావేద్, గౌరీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ...వృద్ధి రేటులో యావత్ భారతదేశంలోనే తెలంగాణ అగ్రభాగాన నిల్చిందన్నారు. ఇక్కడ పరిశ్రమలను నెలకొల్పేందుకు ప్రపంచ స్థాయిలో పోటీ పడుతున్నాయని చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు వాణిజ్యవేత్తలు ఆసక్తి కనబరుస్తున్నారని వివరించారు. ఉన్నత విద్యావంతులకు గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందుతోన్న హైదరాబాద్ మహానగరంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ఇప్పుడు ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. భవిష్యత్తును ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుకునేందుకు ఎంచుకున్న ఏ మార్గమైనా ఉత్సాహంగా ఉల్లాసంగా గడపాలని కోరారు.

ఐలమ్మ స్ఫూర్తితో మత్స్యకారుల హక్కుల కోసం ఉద్యమం

- మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో మత్స్యకారుల హక్కుల కోసం ఉద్యమాలు సాగించాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి చైతన్య సభల ప్రారంభం సందర్భంగా ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. లెల్లెల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీతారాములు మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకైన ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించటం నేటి పరిస్థితుల్లో ఎంతో అవసరమన్నారు. భూస్వాముల దమనకాండకు వ్యతిరేకంగా నిలబడి, అణగారిన రైతులకు, వృత్తిదారులకు ఆమె ధైర్యాన్నిచ్చిందని గుర్తు చేశారు. ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిందన్నారు. కార్యక్రమంలో వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవి రమణ, టిఎంకెఎంకెఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడుగు వెంకట్, కల్లెల్లి లలిత ఉపాధ్యక్షులు శీలం శ్రీను, చనమోని శంకర్, మురారి మోహన్ దుబ్బుల దుర్గయ్య, దర్గయ్య, గాండ్ల అమరావతి, బక్కి బాలమాని, గాడేపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట వినడం లేదని కుల బహిష్కరణ

- బాధితుడి తల్లి దశదిన కర్మకు వెళ్లని పెద్దలు
- గూడూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- పోలీస్ స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంప్యూటర్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న పరిస్థితుల్లోనూ కుల బహిష్కరణ, సాంఘిక బహిష్కరణ ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామ పెద్దల మాట వినడం లేదని ఓ వ్యక్తి తల్లి దశ దిన కర్మకు ఎవరూ వెళ్లొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా అతిక్రమిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి..

గూడూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ పోస్టుమాస్టర్, రజక సామాజిక తరగతికి చెందిన సోమయ్యకు తన సోదరులతోపాటు పాలివారితో కొన్నేండ్లుగా భూ తగాదాలు నడుస్తున్నాయి. సమస్యను పరిష్కరించాలని సోమయ్య కుల పెద్దలను ఆశ్రయించారు. ఒక గ్రూపు వారు తనకు అన్యాయం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ప్రశ్నించాడు. దాంతో తమ మాట వినడం లేదని, సోమయ్య కుటుంబం వైపు ఎవరూ కన్నెత్తి చూడొద్దని, మాట్లాడొద్దని కుల పెద్దలు హుకుం జారీ చేశారు. ఈ క్రమంలో ఇటీవల సోమయ్య తల్లి మృతి చెందారు. దశ దిన కర్మకు రజక సామాజిక తరగతి వారు కొద్ది మంది మాత్రమే వెళ్లగా.. కుల పెద్దలు హాజరు కాలేదు. దీంతో మనోవేదనకు గురైన సోమయ్య తనను కుల బహిష్కరణ చేశారని ఈనెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆపరేషన్ మూసీ షురూ..!

- మూసీ రివర్ బెడ్‌లో సర్వే ప్రారంభం
- మూడు జిల్లాల్లో మొత్తం 25 బృందాల పర్యటన
- వెయ్యి ఇళ్లకు పైగా మార్కింగ్ పూర్తి
- నిర్వాసితులకు వేరే చోట 'డబుల్' ఇళ్ల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధిపై దృష్టిసారించిన ప్రభుత్వం.. ఆపరేషన్ మూసీ స్టార్ట్ చేసింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన ప్రాంతాలను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మొదటి విడతగా రివర్ బెడ్ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలకు మార్కింగ్ చేసి, నివాసితులను డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు తరలించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో రెవెన్యూ అధికారుల సర్వే ప్రశాంతంగా జరిగింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 16 బృందాలు, రంగారెడ్డి జిల్లాలో నాలుగు బృందాలు, మేడ్చల్ జిల్లాలో 5 బృందాలు.. మూసీ రివర్ బెడ్‌లో ఉన్న ప్రతి ఇల్లూ తిరుగుతూ.. వివరాలు సేకరించి, ఇళ్లకు మార్క్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వెళ్లడానికి నివాసితులను ఒప్పించారు. కొన్నిచోట్ల అధికారులకు తమ డిమాండ్లను నివాసితులు తెలియజేశారు. నిర్మాణాలు అధికంగా ఉన్న బహదూర్‌పురాలో ఐదు బృందాలు, హిమాయత్‌నగర్, నాంపల్లిలో మూడు బృందాలు పని చేశాయి. ఉదయం 9 గంటలకే ఫీల్డ్‌లోకి వెళ్లిన అధికార బృందాలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాయి. సొంత ఇల్లా? అద్దెకు ఉంటున్నారా? ఎన్నేండ్ల నుంచి ఉంటున్నారు? ఎంతమంది ఉంటున్నారు? ఆధార్ కార్డ్?, రేషన్‌కార్డు?, కరెంట్ బిల్లు?, ఇంటి కాగితాలు, యజమాని ఎవరు? తదితర డాక్యుమెంట్లను పరిశీలించి సర్వే పత్రంలో నమోదు చేసుకున్నారు. చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్ నగర్‌లో హిమయత్ నగర్ తహసీల్దార్ సంధ్యారాణి, గోల్కొండ మండల పరిధిలోని ఇబ్రహీంబాగ్, ఆశ్రమ్‌నగర్ ఎమ్మార్వో అహల్య, బహదూర్‌పురా, కిషన్‌బాగ్ పార్క్ సమీపంలో తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు.

నిరసనలు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు ఇండ్లను మార్కింగ్ చేసి, నివాసితులను ఒప్పించడానికి 25 బృందాలను బుధవారం ఏర్పాటు చేశారు. గురువారం మొదటి రోజు ఆయా బృందాలు ప్రతి ఇల్లూ తిరుగుతూ నివాసితులతో మాట్లాడాయి. ఇప్పుడుంటున్న ఇళ్లకు వరదల ముప్పు ఉంటుందని, ఎప్పటికైనా ఇబ్బందులు తప్పవని వివరించారు. డబుల్ ఇళ్ల డ్రాను నివాసితులతోనే తీయిస్తామని, ఖాళీ చేసే సమయంలో సామాను తీసుకెళ్లడానికి ట్రాన్స్‌పోర్టు ఖర్చు సైతం ప్రభుత్వమే భరిస్తుందని రివర్ బెడ్ నివాసితులకు తెలియజెప్తున్నారు. అయితే, అక్కడక్కడ అధికారులకు నిరసన సెగలు తగిలాయి. చైతన్యపురిలోని సాయినగర్‌లో బఫర్ జోన్ నివాసితులు రెవెన్యూ అధికారులను అడ్డుకున్నారు. తహసీల్దార్ విద్య బృందంతో వాగ్వాదానికి దిగారు. రివర్ బెడ్‌లో నిర్మించుకున్న ఇండ్లకు నోటీసులు ఇస్తున్న సమయంలో బఫర్ జోన్‌లో ఉన్నవారు ఆందోళనకు దిగడంతో అధికారులు నచ్చజెప్పారు. ప్రస్తుతం రివర్ బెడ్ పరిధిలోనే మార్కింగ్ చేస్తున్నామని సర్దిచెప్పటంతో శాంతించారు. ఈ సర్వే రివర్ బెడ్‌కే పరిమితమని, మిగతావారు ఆందోళన చెందొద్దని సూచించారు. కాగా, హైదరాబాద్ జిల్లాలో మొత్తం 1071 ఇండ్లు, కమర్షియల్ కట్టడాలు ఉండగా.. గురువారం 780 ఇండ్లకు మార్కింగ్ చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 239 ఉండగా.. 75 ఇండ్లకు మార్కింగ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో 333 ఉండగా, 150 ఇండ్లకు మార్కింగ్ చేశారు. గండిపేటలో మరో 32 షెడ్లను స్వయంగా యజమానులే కూల్చేసుకున్నారు.

కావాల్సిన చోట 'డబుల్' ఇళ్లు కేటాయింపు!?

ప్రస్తుతం చేస్తున్న సర్వే ఆధారంగా అయితే సొంత ఇళ్లు ఉన్నవారందరికీ డబుల్ బెడ్‌రూమ్ నివాసాలు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. ఇండ్లు కోల్పోతున్న వారికి వేరొక చోట డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించే అవకాశం ఉంది. సర్వే సందర్భంగా మూడు ప్రాంతాలను సూచిస్తూ.. ఎక్కడ ఇల్లు కావాలనేది అడిగి తెలుసుకుంటున్నారు. ప్రధానంగా హైదరాబాద్‌లో ఇండ్లు కోల్పోయిన వారికి సిటీలోనే కేటాయించే అవకాశముంది. మలక్‌పేట చంచల్‌గూడలో 141 డబుల్ బెడ్రూం ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. వనస్థలిపురంలోని సాహేబ్ నగర్‌లో 95 డబుల్ ఇండ్లు, ధూల్‌పేటలోనూ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఖాళీగా ఉన్నాయి. వాటిని కేటాయించే అవకాశం ఉందని సమాచారం. బఫర్ జోన్‌లో, ఎఫ్టీఎల్‌లో ఇండ్లు ఉన్నవారికి కొల్లూరు డబుల్ బెడ్రూంలలో అవకాశం ఇస్తారని తెలుస్తోంది. నాగోల్ బండ్లగూడలోని ఖాళీ రాజీవ్ స్వగృహ ఇండ్లను నిర్వాసితులకు కేటాయిస్తారని ప్రచారం నడుస్తోంది.

నిండుకుండలా సింగూరు

- ప్రాజెక్టులోకి భారీగా వరద

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి మెదక్ జిల్లాలో అతిపెద్ద ప్రాజెక్టు అయిన సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండటంతో నిండుకుండలా మారింది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 29.917 టిఎంసిలు. వారం రోజులుగా ఎగువ భాగం నుంచి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 12.128 క్యూసెక్కులు రావడంతో అధికారులు అప్రమత్తమై ప్రాజెక్టు 11వ గేటును 1.50 మీటర్లు పైకి లేపి దిగువకు 11.446 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ప్రాజెక్టు పైకి అనుమతి ఇవ్వకపోవడంతో పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న మంజీరా నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని, ముఖ్యంగా మత్స్యకారులు, గొర్రెలు, పశువుల కాపర్లు ఆ వైపు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.

గండిపేట్‌లో మూసీ ప్రక్షాళనకు సర్వే

- నదిలో 32 నిర్మాణాల గుర్తింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూసీ ప్రక్షాళనలో భాగంగా మూసీ నదిలో ఉన్న ఇళ్లను రెవెన్యూ అధికారులు గుర్తించారు. గురువారం రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలంలో మొత్తం 32 నిర్మాణాలను గుర్తించారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ, పోలీసు అధికారుల సమన్వయంతో నాలుగు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టారు. గుర్తించిన వాటికి ఆర్బీఎక్స్ అని ముద్రవేశారు. వీటిని త్వరలో కూల్చేందుకు ఏర్పాట్లు చేస్తామని అధికారులు తెలిపారు. బండ్లగూడ కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్, గంధంగూడ మంచిరేవుల, నార్సింగి, బైరాగిగూడ గ్రామాల మీదుగా మూసీ పరివాహక ప్రాంతంలో ఇళ్లను రీ సర్వే చేశారు. హైదర్‌షాకోట్‌లో సాయి హర్షనగర్, విశాల్‌నగర్, గంధంగూడాలోని విఘ్నేశ్వర్‌నగర్ కాలనీలో రివర్‌పైన ఉన్న ఇళ్లను గుర్తించారు. వారి నుంచి పూర్తి వివరాలు సేకరించారు. అధికారుల సర్వేతో మూసీ పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇక్కడ తాము దశాబ్దాలుగా ఉంటున్నామని స్థానికులు తెలిపారు. ఇంటి ట్యాక్స్‌లు కూడా కడుతున్నామని చెప్పారు. ఇప్పుడు అధికారులు వచ్చి ఇండ్లకు మార్కులు వేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐలు, మున్సిపల్, ఇరిగేషన్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

థామ్సన్ ఉత్పత్తులపై తగ్గింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ : ఫ్రెంచ్ కన్స్యూమర్ బ్రాండ్ థామ్సన్ తమ ఉత్పత్తులపై ప్రత్యేక డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. సెప్టెంబర్ 26 నుంచి ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డే సేల్ సందర్భంగా తమ స్మార్ట్ టివిలు, వాషింగ్ మెషీన్‌లు, స్పీకర్లపై సంవత్సరంలో అతిపెద్ద డీల్‌లను ఇస్తున్నట్లు ప్రకటించింది. పలు బ్యాంకింగ్ కార్డ్‌లపై మరింత తగ్గింపును పొందవచ్చని పేర్కొంది.

కెటిఆర్‌కు సృజన్‌రెడ్డి లీగల్ నోటీస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు సృజన్‌రెడ్డి లీగల్ నోటిస్ పంపించారు. అమృత్ టెండర్ల విషయంలో లేనిపోని ఆరోపణలు చేసినందుకు లీగల్ నోటీసులు పంపించినట్టు పేర్కొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి దగ్గరి బంధువు కావడం వల్లే టెండర్లు ఇచ్చారంటూ కెటిఆర్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. తన కంపెనీ శోభ కన్‌స్ట్రక్షన్‌ను 2010లో ఏర్పాటు చేశామనీ, 2020 నుంచి ఎఐఆర్, ఐహెచ్‌పాలతో కలిసి జాయింట్ వెంచర్‌గా పనిచేస్తుందని పేర్కొన్నారు. అమృత్ టెండర్లలో రూ.1,110కోట్ల పనులను నిబంధనల ప్రకారమే దక్కించుకున్నామని అన్నారు. కెటిఆర్ చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవాలనీ, లేకుంటే చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని నోటీస్‌లో పేర్కొన్నారు.

బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్ర వల్లే జైనూర్‌లో మతకలహాలు

- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి
- ప్రొఫెసర్ పద్మజాషా, సంధ్య, పర్వీన్ డిమాండ్
- నిజనిర్ధారణ కమిటీ నివేదిక విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో బిజెపి, ఆర్ఎస్ఎస్ కుట్ర వల్లే ఈనెల నాలుగున మతకలహాలు చోటుచేసుకున్నాయని ప్రొఫెసర్ పద్మజాషా, పిఒడబ్ల్యు జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రతినిధులు ఎస్క్యూ మసూద్, ఖలీదా పర్వీన్, సారా మాథ్యూ, కనీజ్ ఫాతిమా, సొందె అన్సార్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జైనూర్‌లో జరిగిన సంఘటనకు సంబంధించి నిజ నిర్ధారణ కమిటీ నివేదికను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ జైనూర్‌లో జరిగిన ఘటన పూర్తిగా బిజెపి, ఆర్ఎస్ఎస్ రాజకీయ కోణంలో కుట్ర చేశాయని విమర్శించారు. ఆదివాసీలు, ముస్లింల మధ్య చిచ్చుపెట్టి మతకలహాలను రెచ్చగొట్టేలా వ్యవహరించాయని అన్నారు. ముస్లింలే లక్ష్యంగా బిజెపి, దాని అనుబంధ సంఘాలు దాడులకు పాల్పడ్డాయని వివరించారు. ఈ ఘటనపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇంటెలిజెన్స్, పోలీసుల ఘోరంగా వైఫల్యం చెందారని విమర్శించారు. మతకలహాలు జరుగుతాయని పసిగట్టి వాటిని నిరోధించేందుకు చర్యలు చేపట్టలేదన్నారు. ఈ ఘటనలో విఫలమైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలనీ, డిఎస్‌పి, స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలనీ, మత కలహాలు జరగకుండా చూడాలని కోరారు. ఆదివాసీల భుజంపై తుపాకీ పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సున్నితమైన ఈ సమస్య వ్యాప్తి చెందేలాగా రాజకీయ పార్టీలు వ్యవహరించొద్దని సూచించారు. నేరం ఎవరు చేసినా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ ఘటనలో ఓ మహిళపై ముస్లిం వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపర్చారనీ, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ వ్యక్తి కొట్టినందుకు ముస్లిముల ఇళ్లు, దుకాణాలను కాల్చడం, లూటీ చేయడం సరైంది కాదన్నారు. ఈ ఘటనలో బాధితులకు రక్షణ కల్పించాలనీ, నేరస్తులను శిక్షించాలని డిమాండ్ చేశారు. మతపరమైన కోణంలో ఈ ఘటనను చూడొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హిందూత్వ ఎజెండా పేరుతో సాగిస్తున్న అరాచకాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఆ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కను త్వరలో కలిసి నిజ నిర్ధారణ కమిటీ నివేదికను సమర్పిస్తామని చెప్పారు.

నేతన్నల పొట్టకొట్టొద్దు

- ఉపాధి కల్పించి ఆదుకోవాలి
- ప్రభుత్వం దివాళాకోరు రాజకీయం చేస్తోంది : కెటిఆర్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సిరిసిల్ల నేతన్నలను అన్ని విధాలుగా ఆదుకుని, చేతినిండా పని కల్పించింది బిఆర్ఎస్ ప్రభుత్వం.. సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని సంకల్పించాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్ ఆపేసి దివాళాకోరు రాజకీయం చేస్తోంది.. నాపై కోపంతో నేతకార్మికుల పొట్టకొట్టొద్దు.. ఆర్డర్లు ఇచ్చి ఉపాధి కల్పించాలి" అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు.

గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004నుంచి 2014వరకు కాంగ్రెస్ హయాంలో సిరిసిల్లలో ఆత్మహత్యలు జరిగాయన్నారు. ఒకే వారంలో తొమ్మిది మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. నాడు ఎంపిగా ఉన్న కెసిఆర్ చలించిపోయి పద్మశాలీ ట్రస్ట్‌కు రూ.50 లక్షలు అందజేశారని చెప్పారు. రాష్ట్రం ఏర్పడ్డాక సిరిసిల్ల వ్యాపారవేత్తలతో నాటి సిఎం కెసిఆర్ సమావేశమై నేతన్నలను ఆదుకునేందుకు చర్చలు జరిపారన్నారు. వారికి ఉపాధి కల్పించడంతో కోటి మంది ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని కెసిఆర్ నిర్ణయించారన్నారు. అందుకు సిరిసిల్లలో బతుకమ్మ చీరలు ఉత్పత్తిచేసి ఏడాదికి 8నెలలు ఉపాధి కల్పించి నేతన్నలను ఆదుకున్నట్టు వివరించారు. స్కూల్ యూనిఫామ్స్, కేసీఆర్ కిట్‌లో ఇచ్చే చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్‌కు కానుక చీరలను సిరిసిల్లలో తయారు చేయించామన్నారు. ఎనిమిదేళ్ల పాటు రూ.3,312 కోట్ల ఆర్డర్లు సిరిసిల్లకు ఇవ్వడంతో నేతన్నలకు ఉపాధి లభించి ఆత్మహత్యలు ఆగిపోయాయన్నారు. ఈ క్రమంలోనే ఆధునీకరణ వైపు ఆలోచనలను చేస్తూ సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని బిఆర్ఎస్ ప్రభుత్వం ఆశించిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బతుకమ్మ చీరలను నిలిపివేసి కార్మికుల ఉపాధిపై దెబ్బ కొట్టిందన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను బంద్ చేయడంతో నేతన్నల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కోటి మందికి పైగా ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు బంద్ అయ్యాయన్నారు. రాజకీయంగా తన మీద కోపంతో రాజన్న సిరిసిల్ల ప్రజలు, నేతన్నల మీద కక్ష తీసుకోవద్దని కోరారు.

సిరిసిల్లలో రేషన్ షాప్ కేటాయింపుల్లో జరిగిన అవకతవకలపై న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. హైడ్రా మీద ప్రభుత్వం హైడ్రామా చేస్తున్నదని, ఎవరికైనా అన్యాయం జరిగితే, తమను సంప్రదిస్తే వారి తరపున న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, సెస్ చైర్మెన్ చిక్కాల రామరావు, బొల్లి రాంమోహన్ ఉన్నారు.

కొదురుపాకలో ప్రాథమిక పాఠశాల భవనం ప్రారంభం

సిరిసిల్ల బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామంలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తన అమ్మమ్మ ఊరు కొదురుపాకలో.. అమ్మమ్మ- తాతయ్య పేరు మీద ఈ స్కూలు నిర్మాణానికి తనవంతు సహాయం చేశానన్నారు. ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా బీఆర్ఎస్ విద్యార్థుల భవిష్యత్ కోసం పనిచేస్తుందన్నారు. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుంటానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కూస రవీందర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కొండయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేస్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బసవతారకం హాస్పిటల్‌తో రెడ్.హెల్త్ భాగస్వామ్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ : అత్యవసర వైద్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌తో రెడ్.హెల్త్ భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సిఇఒ డాక్టర్ కె కృష్ణయ, సిఒఒ సునీల్ టాండన్, రెడ్‌హెల్త్ వ్యవస్థాపకుడు ప్రభదీప్ సింగ్ పాల్గొన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఆ హాస్పిటల్‌కు అత్యాధునిక సదుపాయాలు కలిగిన అంబులెన్స్‌ను రెడ్.హెల్త్ అందించింది.

హేతుబద్ధీకరణ ఉత్తర్వులకు వ్యతిరేకంగా రేపు జిల్లా కేంద్రాల్లో నిరసనలు

- అశాస్త్రీయమైన సర్దుబాటు జిఒ 25ను సవరించాలి
- విద్యాశాఖ సంచాలకులకు యుఎస్‌పిసి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసమంజసమైన హేతుబద్ధీకరణ ఉత్తర్వులకు వ్యతిరేకంగా శనివారం జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి పిలుపునిచ్చింది. అశాస్త్రీయమైన సర్దుబాటు జిఒ 25ను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్‌జిటిలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని కోరింది. గురువారం హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డిని యుఎస్‌పిసి స్టీరింగ్ కమిటీ సభ్యులు కె జంగయ్య, పి నాగిరెడ్డి కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికొక టీచరు ఉండాలనీ, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులుండాలని కోరారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20 గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మీడియం వారీగా లెక్కించాలని సూచించారు. అదనపు ఉపాధ్యాయులను 1:30 నిష్పత్తిలో లెక్కించాలని తెలిపారు. 2021 ఆగస్టులో ఏకపక్షంగా ఇచ్చిన హేతుబద్ధీకరణ జిఒ 25 పట్ల సర్వత్రా వ్యతిరేకత రావటంతోనే అమలు చేయకుండా నిలిపేశారని పేర్కొన్నారు. ఇప్పుడు అదే జీవోలోని నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయటం వల్ల పాఠశాలలకు నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పలు పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి మూసివేతకు దారితీస్తాయని వివరించారు. జీవో 25లోని నిబంధనలను సవరించాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యాన్ని కాలరాసింది బిఆర్ఎస్సే..

- పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది ఆ పార్టీయే..
- ఏ పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధం
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవినీతి, అక్రమాలకు మారుపేరు బిఆర్ఎస్ పార్టీ.. పదేండ్లు అధికారంలో ఉండి ప్రజాస్వామ్యాన్ని కాలరాసి.. రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ సర్వనాశనం చేశారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బిఆర్ఎస్ నాయకులు స్థాయి మరచి పిచ్చి పిచ్చిమాటలు మాట్లాడొద్దని, ప్రజలు ఎందుకు మిమ్మల్ని తిరస్కరించారో గుర్తెరిగి మాట్లాడాలని హితవు పలికారు. మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం తనదని, ఎగిరిన వారందరూ కనుమరుగై పోయారని అన్నారు. తనకు ప్రజాశీర్వాదం ఉందని, ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థ, ఎన్నికల వ్యవస్థలపై గౌరవముందని చెప్పారు. ఏ పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. వరంగల్ జిల్లా చరిత్రను కాలరాసే విధంగా వ్యవహరించొద్దని మొత్తుకున్నాను.. ఉమ్మడి జిల్లాను ఆరు ముక్కలు చేయొద్దని ఎదురు తిరిగాను కాబట్టే రెండోసారి తనకు మంత్రి పదవి రాలేదని అన్నారు. కెసిఆర్ నియంతృత్వంతో ప్రజాస్వామ్యవాదుల నోరు నొక్కారని విమర్శించారు. వారి కుటుంబమంతా కలిసి ఇష్టారీతిగా దోపిడీకి ఎగబడిందని ఆరోపించారు. కోట్లాది ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటోళ్లు ఇప్పుడు తొమ్మిది నెలల పాలన పూర్తికాని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆగం చేసి, అప్పుల ఊబిలోకి నెట్టి, ఖాళీ ఖజానాను అప్పజెప్పి సమయం ఇవ్వకుండా మాట్లాడటమేంటని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బిఆర్ఎస్ అని, పదేండ్ల కాలంలో 38 మంది ఎమ్మెల్యేలను, చివరికి శాసనసభ పక్షాలను కూడా చేర్చుకున్నారని అన్నారు. అప్పుడు గుర్తుకురాని ప్రజాస్వామ్యం, ఫిరాయింపుల చట్టం ఇప్పుడెలా గుర్తుకొస్తున్నాయని ప్రశ్నించారు. కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటామని, ఉప ఎన్నికలు రావు.. ఒకవేళ వచ్చినా ఆందోళన లేదని, ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు. బిఆర్ఎస్‌కు డిపాజిట్లు వస్తాయో.. లేదో ఆలోచించుకోవాలన్నారు.

ఆటవిక చర్యలపై కఠినంగా వ్యవహరించాలి

- డప్పు కొట్టనందుకు సాంఘిక బహిష్కరణ దుర్మార్గం
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు
- గౌతోజీగూడెంలో బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేటి ఆధునిక యుగంలో ఆటవిక చర్యలకు ఉసిగొల్పుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని.. పల్లె ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు అన్నారు. డప్పు కొట్టనందుకు గ్రామం నుంచి సాంఘిక బహిష్కరణ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. పౌర సమాజం, ప్రభుత్వం ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండించాలని తెలిపారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజీగూడెం గ్రామంలో డప్పు కొట్టనందుకు సాంఘిక బహిష్కరణకు గురైన దళితుల కుటుంబాన్ని గురువారం కెవిపిఎస్, సిఐటియు నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. దళిత కుటుంబంపై మధ్య యుగాల కాలపు నాటి శిక్షలు విధించడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రజల ఓట్లతో ఎన్నికైన సర్పంచ్, గ్రామ పెద్దలు ఇందులో భాగం అవ్వడం దారుణమన్నారు. గ్రామస్తులతో అధికారులు సమావేశం నిర్వహించి వారిలో చైతన్యం తీసుకొచ్చి సాంఘిక బహిష్కరణను ఎత్తేయించాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎంపి రఘునందన్‌రావు ఈ ఘటనను ఎందుకు ఖండించలేదో చెప్పాలన్నారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి ప్రభుత్వ ఉన్నతాధికారులు నెల రోజులపాటు ప్రత్యేక చైతన్య సభలు నిర్వహించాలన్నారు. బహిష్కరణకు గురైన కుటుంబానికి ప్రభుత్వం పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్యం మాట్లాడుతూ.. డప్పు కొట్టకుంటే సాంఘిక బహిష్కరణ చేస్తారా? అని ప్రశ్నించారు. ఈ ఘటనను ప్రజలు ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు బక్కెల్లి బాలకిషన్ మరాఠీ కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సిఐటియు నాయకులు కడారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్జిన్ నుంచి 2 ఇన్1 స్ప్రే

న్యూఢిల్లీ : దేశంలోనే తొలిసారి దోమలు, బొద్దింకల నియంత్రణకు 2 ఇన్ 1 స్ప్రేను అందుబాటులోకి తెచ్చినట్లు మార్టిన్ తెలిపింది. తమ ఈ వినూత్న ఉత్పత్తి బొద్దింకలు, దోమలు రెండిటిని 100 శాతం నాశనం చేయగలదని ఆ సంస్థ ప్రతినిధి సౌరభ్ జౌన్ పేర్కొన్నారు. దీని ప్రారంభ ధరను రూ.115గా నిర్ణయించింది.